టెన్త్ సప్లిమెంటరీలో 77.99 శాతం ఉత్తీర్ణత

రంగారెడ్డి అర్బన్, జూన్ 28 : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాల్లో 77.99 శాతం ఉత్తీర్ణత నమోదైంది. పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు 4,874 విద్యార్థులు హాజరు కాగా అందులో 3,801మంది ఉత్తీర్ణులయ్యారు. మొత్తం ఉత్తీర్ణత శాతం 77.99గా నమోదైంది. అందులో బాలురు 76.38, బాలికలు 81.02 శాతం పాస్ అయ్యారు. విద్యార్థులు మార్కుల రీ వెరిఫికేషన్ కోసంసబ్జెక్టుకు రూ.500 చెల్లించాల్సి ఉంటుంది. ఆ మొత్తాన్ని జూలై 8వ తేదీ లోగా ఎస్‌బీఐ బ్యాంకు ద్వారా చెల్లించాలని విద్యాశాఖ అధికారులు తెలిపారు.

పరిశ్రమలో భారీ పేలుడు

బూర్గులలోని గ్లాస్ ఫ్యాక్టరీలో పేలిన రియాక్టర్

- ఐదుగురు కార్మికుల మృతి.. 10మందికి తీవ్ర గాయాలు
- మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- పేలుడు ధాటికి చెల్లా చెదురైన మృతదేహాలు
- మృతులంతా యూపీ, బిహార్ రాష్ట్రాలకు చెందిన వారే
- సంఘటన స్థలాన్ని సందర్శించిన కలెక్టర్ శశాంక.. డీసీపీ రాజేశ్వర్

షాద్‌నగర్/షాద్‌నగర్ రూరల్, జూన్ 28 :షాద్‌నగర్ నియోజకవర్గ పరిధి బూర్గుల శివారులోని సౌత్ గ్లాస్ పరిశ్రమలో కార్మికులంతా తమ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఎవరి పనిలో వారు నిమగ్నమై పనిచేస్తున్నారు. ఆ సమయంలో ఒక్కసారిగా భారీస్థాయిలో పేలుడు శబ్దం వినిపించింది. కంపెనీలోని ఆటోక్లేవ్ రియాక్టర్ ఒక్కసారిగా పేలింది. ఆ గ్యాస్ తాకిడికి అక్కడ పనిచేస్తున్న కార్మికులు ఎగిరి దూరంలో పడ్డారు. ఐదుగురు అక్కడికక్కడే మరణించారు. ఆటోక్లేవ్ రియాక్టర్ పేలుడు ధాటికి పరిశ్రమలో పనిచేస్తున్న వారి మృతదేహాలు చెల్లా చెదురయ్యాయి. తల, కాళ్లు, చేతులు విరిగి పరిశ్రమలోని వివిధ ప్రాంతాల్లో పడ్డాయి. ఒక వ్యక్తి మృతదేహం మరో యంత్రంలో ఇరికి ఒక కాలు మాత్రమే బయటకు కనిపిస్తుంది. మరణించిన వారి శరీర భాగాలు పరిశ్రమలోని రేకుల పైభాగం నుంచి పరిశ్రమ ఆవరణలో పడి ఉన్నాయి. పరిశ్రమలో ఎక్కడా చూసినా శరీర భాగాలు, రక్తపు మడుగులతో నిండిపోయింది. ఈ ప్రమాదంలో పదిమంది తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారి ఆర్తనాదాలతో పరిశ్రమ హృదయ విదారకంగా మారింది. ప్రమాద సమయంలో పరిశ్రమలో 50మంది పని చేస్తుండగా పేలిన రియాక్టర్ వద్ద 16మంది పనిచేస్తున్నారు. పరిశ్రమ వద్ద విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో చిమ్మచీకటిగా ఉండి బాధితులను గుర్తించేందుకు ఇబ్బందిగా మారింది. మృతులంతా బిహార్, ఉత్తర్రపదేశ్‌కు చెందిన వారే. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. ప్రమాదం సంభవించిన పరిశ్రమను కలెక్టర్ శశాంక, డీసీపీ రాజేశ్వర్ సందర్శించారు. అనంతరం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులను వారు పరామర్శించారు.

- వివరాలు మెయిన్‌లో




ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శశాంక, డీసీపీ రాజేశ్వర్



ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులు



కాంగ్రెస్ పార్టీ ఎంతోకాలం రాష్ట్రంలో అధికారంలో ఉండదని, ఆ ప్రభుత్వం పడిపోవడం ఖాయమని ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ప్రతీ సందర్భంలోనూ చెబుతోంది. దీనికి ప్రతిగా అధికార పక్షం కూడా ధీటుగానే జవాబిస్తోంది. కేవలం జవాబు ఇవ్వడమే కాదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలనే తమ పార్టీలో చేర్చుకునేలా పావులు కదుపుతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఆ పార్టీ ఎమ్మెల్యేలను హస్తం గూటికి తీసుకువచ్చేలా వేట షురూ చేసింది. చాపకింద నీరులా ఆ ప్రయత్నాలను ముమ్మరం చేసింది. బీఆర్ఎస్ అధిక స్థానాల్లో గెలిచిన ప్రాంతంలోనే ఆ పార్టీని దెబ్బతీసేలా సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డే రంగంలోకి దిగారు. చడీచప్పుడు కాకుండా చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను కారు నుంచి దింపి హస్తం గూటిలో చేర్చుకున్నారు. ఉమ్మడి జిల్లాలో మరికొంతమంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కూడా యాదయ్య బాటలోనే నడవనున్నారన్న ప్రచారం జోరుగా సాగుతోంది.



● బీఆర్ఎస్‌టు కాంగ్రెస్

వేట షురూ!

బీఆర్ఎస్‌కు భారీ షాక్ ● కాంగ్రెస్‌లో చేరిన చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య

- చివరి వరకు గోప్యంగా వ్యవహరించిన కాంగ్రెస్
- ఆయన బాటలో మరికొందరు శివారు ఎమ్మెల్యేలు?
- రంగంలోకి దిగిన సీఎం రేవంత్‌రెడ్డి
- నేరుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో చర్చలు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

అధికార కాంగ్రెస్ పార్టీ ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌కు వరుసగా షాక్ మీద షాక్ ఇస్తోంది. చేరికలపై దృష్టి పెట్టిన అధికార పార్టీ తాజాగా చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్యకు కాంగ్రెస్ కండువా కప్పింది. అనూహ్యంగా ఢిల్లీ వెళ్లిన ఎమ్మెల్యే యాదయ్య శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. వరుసగా మూడుసార్లు చేవెళ్ల నుంచి విజయం సాధించిన యాదయ్య పార్టీ మారే విషయంలో చివరకు వరకు గోప్యంగానే వ్యవహరించారు. ఇదిలా ఉంటే ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మరికొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నట్లు తెలిసింది. నేరుగా సీఎం రేవంత్‌రెడ్డి రంగంలో దిగి చేరికలపై కొందరు ఎమ్మెల్యేలతో మాట్లాడుతున్నట్లు సమాచారం. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఆయన రాష్ట్రంలో అత్యధికంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లాపై ఫోకస్ పెంచారు. 'మా ప్రభుత్వాన్ని పడగొడతామంటే ఊరుకుంటామా? మేము నిలబడేందుకు ఏం చేయాలో అదే చేస్తామని గురువారం ఖరాఖండిగా చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి వెనువెంటనే చేరికలపై దృష్టి సారించారు. ఎమ్మెల్యేలు చేజారకుండా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న బీఆర్ఎస్‌కు షాక్ ఇస్తూ చేవెళ్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలె యాదయ్యను శుక్రవారం గూటికి తీసుకువచ్చారు. ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో అధికార పార్టీ ఉమ్మడి జిల్లాలో ఘోర పరాజయం చెందడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టారు. రేవంత్‌రెడ్డి సిట్టింగ్ స్థానమైన మల్కాజిగిరితో పాటు చేవెళ్ల పార్లమెంట్ స్థానంలో అధికార పార్టీ ఓటమి చెందిన విషయం తెలిసిందే. త్వరలో మళ్లీ స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగనుండడంతో పార్టీని బలోపేతం చేసేందుకు, ప్రభుత్వాన్ని కాపాడుకునేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు ద్వారాలు తెరవాలని కాంగ్రెస్ నాయకత్వం నిర్ణయించింది. పార్టీ అధినాయకత్వం కూడా ఇందుకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డి చేరికలపై దృష్టి సారించారు. రాబోయే వారం రోజుల్లో ఉమ్మడి జిల్లా నుంచి భారీగా చేరికలు ఉండవచ్చని ప్రచారం సాగుతోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో బీఆర్ఎస్‌కు అత్యధికంగా 10మంది ఎమ్మెల్యేలు ఉన్న విషయం తెలిసిందే. వీరందరిపై కూడా అధికార కాంగ్రెస్ పార్టీ కన్నేసింది. ఇప్పటికే కొందరు ఎమ్మెల్యేలు సీఎం రేవంత్‌రెడ్డితో టచ్‌లో ఉన్నారు. ఇద్దరు ముగ్గురు ఎమ్మెల్యేలు వేర్వేరు సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి ఏకాంత చర్చలు జరిపారు. వారం రోజుల్లో మరికొందరు శివారు ప్రాంత ఎమ్మెల్యేలు కాంగ్రెస్ గూటికి చేరుతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. మరికొందరితో చర్చలు కొనసాగుతున్నట్లు సమాచారం.

దశాబ్దం తరువాత సొంతగూటికి...

చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య ఈ స్థానం నుంచి వరుసగా మూడు సార్లు విజయం సాధించారు. దాదాపు దశాబ్ద కాలం తరవాత తిరిగి ఆయన సొంతగూటికి చేరారు. కాంగ్రెస్‌లో అనేక పదవులు అనుభవించిన యాదయ్య 2014లో కాంగ్రెస్ తరఫునన పోటీ చేసి తొలిసారి ఎమ్మెల్యే అయ్యారు. తరువాత ఆయన బీఆర్ఎస్‌లో చేరి 2019, 2023లో ఆ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు. మళ్లీ పదేళ్ల కాలం తరువాత యాదయ్య తిరిగి కాంగ్రెస్ గూటికి చేరడం గమనార్హం. యాదయ్య తన చేరిక విషయాన్ని చివరి వరకు గోప్యంగానే ఉంచారు. యాదయ్య పార్టీ మార్పుపై కొంతకాలంగా ఊహాగానాలు వెలువడుతున్నా ఆయన అదేమీ లేదంటూ ఖండిస్తూ వచ్చారు. బుధవారం వికారాబాద్‌లో జరిగిన జిల్లా పరిషత్ భవన సముదాయం ప్రారంభోత్సవ సభలో యాదయ్య మాజీ మంత్రి మహేందర్‌రెడ్డితో నిధుల విషయంలో కూడా స్వల్పంగా ఘర్షణ పడ్డారు. దీంతో యాదయ్య పార్టీ మార్పుపై ఎవరికీ అనుమానం కూడా రాలేదు. శుక్రవారం ఉదయం ఆయన మాజీమంత్రి చంద్రశేఖర్, తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డితో కలిసి ఢిల్లీ వెళ్లారు. ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకునే వరకు చేరిక విషయం గోప్యంగానే ఉంచారు.

పంచాయతీ సిబ్బంది సమస్యలు

పరిష్కరించాలి

- కలెక్టరేట్ ఎదుట ధర్నా

రంగారెడ్డి అర్బన్, జూన్ 28 : గ్రామ పంచాయతీ సిబ్బంది పెండింగ్ బిల్లులు తక్షణమే ఇవ్వాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జి. పాండు, గౌరవ అధ్యక్షుడు భాస్కర్ డిమాండ్ చేశారు. గ్రామ పంచాయతీ సిబ్బందికి పెండింగ్‌లో ఉన్న జీతాలను తక్షణమే ఇవ్వాలని, రూ. 5లక్షల ఇన్సూరెన్స్ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పాండు, భాస్కర్‌లు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ సిబ్బందినందరినీ పర్మనెంట్ చేయాలని, వేతనాలకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలన్నారు. ఒకటో పీఆర్సీ ప్రకారం 30శాతం వేతనాలు గ్రామ పంచాయతీ సిబ్బందికి అమలు చేయాలని, పీఆర్సీ పరిధిలోకి గ్రామ పంచాయతీ సిబ్బందిని తీసుకు రావాలన్నారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయక కార్యదర్శులుగా నియమించి.. పర్మనెంట్ చేయాలని వారు డిమాండ్ చేశారు. జీవో నెం.51ని సవరించాలని, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, పాత కేటగిరీలన్నింటినీ యధావిధిగా కొనసాగించాలన్నారు. విధి నిర్వహణలో ప్రమాదం జరిగి మరణించిన సిబ్బంది కుటుంబానికి రూ.10 లక్షల నష్టపరిహారాన్ని ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. దీని అమలు పోస్టాఫీస్ బీమా పథకం ద్వారా చెల్లించాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, సహజ మరణానికి ఇన్సూరెన్స్ పథకాన్ని రూ.5 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. 2011 జనాభా ప్రకారం కాకుండా అవసర ప్రాతిపదికన కార్మికులను తీసుకోవాలని, ప్రస్తుతం పనిచేస్తున్న వారందరికీ వేతనాలు పెంచాలన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, గ్రాట్యూటీ సౌకర్యాలు కల్పించాలని, గ్రామ పంచాయితీ సిబ్బంది అందరికీ రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలన్నారు. ప్రమాదంలో మరణించిన కార్మికుని దహన సంస్కారాలకు రూ.10వేలు కాకుండా కనీసం రూ. 20 వేలు ఆర్థిక సహాయం అందించాలని కోరారు. వయస్సు మీరిందనే సాకుతో కార్మికులను మార్చితే ఆ కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని, ఆదాయమున్న పంచాయతీలలో వేతనాలు పెంచుకునేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ నాటి గుర్తింపు కార్డులను తొలగించి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు కార్డులను ఇవ్వాలని వారు కోరారు. ఈ ధర్నాలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సీహెచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.




కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పంచాయతీ కార్మికులు

ప్రజలకు నష్టం చేకూర్చే

పరిశ్రమలు ఏర్పాటు చేయం

- హెల్త్, ఎడ్యుకేషన్, టూరిజం హబ్‌లను అభివృద్ధి చేస్తాం
- కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి



మాట్లాడుతున్న కోదండరెడ్డి

యాచారం, జూన్ 28: గత ప్రభుత్వం యాచారం, కందుకూరు మండలాల పరిధిలో హైదరాబాద్ ఫార్మాసిటీ కోసం సేకరించిన భూముల్లో ప్రజలకు నష్టం కల్గించే ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయబోం అని కిసాన్‌సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎం.కోదండరెడ్డి తెలిపారు. ఈ నిర్ణయంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీకి కట్టుబడి ఉందన్నారు. శుక్రవారం ఆయన యాచారంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సేకరించిన భూముల్లో కాలుష్య రహిత ఎడ్యుకేషన్, హెల్త్, టూరిజం హబ్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే ఎలాంటి పరిశ్రమలు ఏర్పాటు చేయం తేల్చి చెప్పారు. దీనిపై అపోహలకు తావు లేదన్నారు. ప్రభుత్వం వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసే చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై మహారాష్ట్ర ప్రభుత్వ ప్లానింగ్ కమిషన్ మాజీ సభ్యుడు దేశ్‌రథకు ఏం తెలుసని విమర్శిస్తూ మాట్లాడారో తనకు అర్థం కావడం లేదన్నారు. ఈ ప్రాంతంలో మెడికల్ కాలేజీలు, ఆస్పత్రుల ఏర్పాటుకు కృషిచేస్తున్నట్లు చెప్పారు. ఈ ప్రాంతానికి మెట్రోరైల్ లైన్ తెచ్చేందుకు ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారని తెలిపారు. దేశ్‌రథ గురువారం ఇక్కడికొచ్చి గంట వ్యవధిలో కొందరిని కలిసి విలేకరుల సమావేశంలో తోచింది మాట్లాడడం సరికాదన్నారు. పోటీ ప్రపంచంలో మనం కూడా ముందుకు పోవాలనేది కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. పేదలను అన్ని విధాలా ఆదుకునేందుకు కాంగ్రెస్ సంస్కరణలు తెచ్చిందన్నారు. ప్రతీ పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి దృఢనిశ్చయంతో ఉన్నారన్నారు. ఇక్కడ మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసి ప్రపంచస్థాయి వైద్య విద్యనందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. మెడికల్ కాలేజీలు, ఆధునిక వైద్యసేవలందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఐటీ రంగం బలోపేతానికి యత్నిస్తోందన్నారు. యువతకు ఉపాధి కల్పిస్తామన్నారు. ఈ విషయంలో ప్రజలను గందరగోళంలో పడేయవద్దని ఈ సందర్భంగా కోదండరెడ్డి అన్నారు.

అన్నీ లోపాలే..!

- కొత్తూర్ మండలంలో రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ కమిషన్ పర్యటన
- మధ్యాహ్న భోజనం, అంగన్‌వాడీ, పీహెచ్‌సీల పనితీరుపై ఆరా
- లోపాలను సరిదిద్దుకోవాలి: చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి
- నిరుపేదలకు నాణ్యమైన భోజనం అందించాలి: కమిషన్ సభ్యులు

కొత్తూర్, జూన్ 28: విద్య, వైద్యం, పౌష్టికాహారం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు పరుస్తున్న పథకాల అమలుతీరులో అన్నీ లోపాలే ఉన్నట్టు రాష్ట్ర ఫుడ్ కమిషన్ గుర్తించింది. రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో కమిషన్ సభ్యులు శుక్రవారం కొత్తూర్ మండల కేంద్రంలో పర్యటించారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజనం, రేషన్‌షాపుల పనితీరుతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. కమిషన్ సభ్యులకు అడుగడునా లోపాలతో పాటు సమస్యలు ఎదురయ్యాయి. అంగన్‌వాడీలో పౌష్టికాహారం పంపిణీలో లోపాలున్నాయని కమిషన్ సభ్యులు గుర్తించారు. ఆన్‌లైన్ నమోదుతో పాటు, అధికారుల సమన్వయ లోపం కారణంగా నెలల తరబడి విద్యార్థులకు, గర్భిణులకు పాలు అందడం లేదని గుర్తించారు. విద్యార్థులకు వడ్డించే ఆహారాన్ని కమిషన్ సభ్యులు రుచి చూశారు. ఉన్నత పాఠశాలలో మధ్యహ్న భోజనాన్ని పరిశీలించిన సభ్యులు అక్కడ సరైన మెనూ పాటించడం లేదని గుర్తించారు. వారంలో మూడు రోజులు గుడ్లు ఇవ్వాల్సి ఉండగా రెండు రోజులు మాత్రమే ఇస్తున్నట్లు తనిఖీలో బయటపడింది. మెనును వెంటనే సరిదిద్దుకోవాలని హెచ్‌ఎం అంగోర్‌నాయక్‌కు కమిషన్ సూచించింది. స్థానిక 15వ రేషన్‌షాపును పరిశీలించిన సభ్యులు సరుకుల పంపిణీలో లోపాలు ఉన్నాయని గుర్తించారు. అంత్యోదయ కార్డుదారులకు చక్కెర, గోధుమలు ఎందుకు పంపిణీ చేయడం లేదని డీలర్ భాస్కర్‌ను ప్రశ్నించారు. డీడీలు కట్టినా చక్కెర సరఫరా చేయడం లేదని డీలర్ కమిషన్ సభ్యుల దృష్టికి తీసుకొచ్చారు. ఇందుకు జిల్లా సివిల్‌సప్లై అధికారులు స్పందిస్తూ చక్కెర జిల్లా స్టాక్‌పాయింట్‌లో అందుబాటులో ఉందని సమాధానం ఇచ్చారు. అధికారులు, డీలర్ల సమన్వయ లోపం కారణంగా నిరుపేదలకు చక్కెర అందడం లేదని సభ్యులు అవేదన వ్యక్తం చేశారు. స్థానిక పీహెచ్‌సీని పరిశీలించిన కమీషన్ సభ్యులు ప్రభుత్వ పథకాల అమలు తీరుపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ నిరుపేదలకు నాణ్యమైన భోజనం అందించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. నిరుపేదలకు నాణ్యమైన వైద్యం, పౌష్టికాహారం అందించడంలో ఫుడ్ కమిషన్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. కమిషన్ సభ్యుడు ఆనంద్ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణీలు పౌష్టికాహారం అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమల్లోకి తీసుకువచ్చాయన్నారు. కార్యక్రమంలో కమీషన్ సభ్యులు కొంతం గోవర్ధన్‌రెడ్డి, రంగినేని శారద, మూలకుంట భారతి, జ్యోతి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు, డీఈవో సుశీందర్‌రావు, డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, షాద్‌నగర్ ఆర్డీవో వెంకటమాధవరావు, జిల్లా వెల్ఫేర్ అధికారి పద్మజారమణి, జిల్లా సివిల్ సప్లై అధికారి రాథోడ్, జిల్లా మేనేజర్ విజయలక్ష్మి, అదనపు పీడీ సుభాషిణి, స్థానిక జడ్పీటీసీ ఎమ్మో శ్రీలత, మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ హరికిషన్, తహసీల్దార్ రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో అరుంధతి, ఐసీడీఎస్ సీడీపీవో నాగమణి తదితరులు పాల్గొన్నారు.



ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అన్నం వడ్డిస్తున్న ఫుడ్ సేఫ్టీ కమిషన్ చైర్మన్, సభ్యులు

ప్రజల హక్కులకు భంగం కలిగితే చర్యలు తప్పవు

రంగారెడ్డి అర్బన్ : ప్రజల హక్కులకు భంగం కలిగితే చర్యలు తప్పవని ఫుడ్ కమిషన్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఫుడ్ సేఫ్టీపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలని రాజ్యాంగం ద్వారా కల్పించబడిన హక్కు పకడ్బందీగా అమలయ్యేలా పర్యవేక్షించేందుకు రాష్ట్ర ఫుడ్ కమిషన్ ఏర్పాటు అయ్యిందన్నారు. ఇది చట్టబద్ధత కలిగిన కమిషన్ అయినందున ప్రజల హక్కులకు భంగం కలిగినప్పుడు చర్యలు చేపట్టే అధికారం కమిషన్‌కు ఉందని స్పష్టం చేశారు. శిశువులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, విద్యార్థులు, నిరుపేద ప్రజలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించి ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి దోహదపడాలని చైర్మన్ పిలుపునిచ్చారు. ప్రజల పౌష్టికాహారం హక్కుకు భంగం కలిగించే వారిపై కమిషన్ కఠినంగా వ్యవహరిస్తుందన్నారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీలో 26 మంది విద్యార్థినులకు అస్వస్థత



అస్వస్థతకు గురైన బాలికల ఆరోగ్యంపై ఆరాతీస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, జూన్ 28: వికారాబాద్ జిల్లా పరిగి కస్తూర్బాగాంధీ పాఠశాలలో 26 మంది విద్యార్థినిలు అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకున్నారు. పరిగి మండలం నస్కల్‌లోని కస్తూర్బాగాంధీ పాఠశాలలోని బాలికలకు గురువారం సాయంత్రం స్నాక్స్‌లో భాగంగా శనగలు ఇచ్చారు. అదే సమయంలో ఐరన్ పోలిక్‌యాసిడ్ మాత్రలు ఇచ్చారు. తర్వాత రాత్రి పది గంటల తర్వాత విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని వెంటనే పరిగిలోని ప్రభుత్వ అస్పత్రికి తరలించారు. తీవ్ర అస్వస్థతకు గురైన ఎల్.లావణ్య, ఎ.అనూష, వి.నందిని, జి.స్పందన, ఎస్.నిహారిక, వి.ఇందు, కె.ఇందులకు ప్రత్యేక చికిత్సలు అందించారు. కాగా విద్యార్థినులందరూ కోలుకున్నారు. అయితే బాలికలు పోలిక్‌యాసిడ్ మాత్రలు వేసుకోవడం వల్లనే అస్వస్థతకు గురైనట్లు డీసీహెచ్‌వో డాక్టర్ ప్రదీప్ తెలిపారు. ఈ మాత్రలు కొందరికి పడవని చెప్పారు.

శుక్రవారం మరో ఆరుగురికి అస్వస్థత

శుక్రవారం సాయంత్రం ఆరుగురి బాలికలకు మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. వీరికి పరిగి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. గురువారం రాత్రి చికిత్స పొంది డిచ్చార్జీ అయినా స్వప్న, అనూష, ఝాన్సీ, ఇందు, మేఘన, నందినిలకు మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. వీరిని కేజీబీవీ పాఠశాల సిబ్బంది పరిగి అస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తున్నారు. ప్రస్తుతం వీరు కోలుకుంటున్నారు. అలాగే వైద్య శాఖ ఆధ్వర్యంలోని నస్కల్‌లోని కేజీబీవీలో ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేసి వైద్య చికిత్సలు అందిస్తున్నారు.

పరామర్శించిన కలెక్టర్, ఎమ్మెల్యే

నస్కల్‌లోని కస్తూర్బాగాంధీ పాఠశాలలోని బాలికలు అస్వస్థతకు గురైన విషయాన్ని తెలుసుకున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్ పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఆర్డీవో వాసుచంద్ర, డీఈవో రేణుకాదేవి, తదితరులు పరిగి ప్రభుత్వ అస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులను పరామర్శించారు. అస్వస్థతకు గురైన బాలికలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీహెచ్‌వో ప్రదీప్, పరిగి ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్, వైద్యబృందం దగ్గర ఉండి చికిత్సలు అందించారు. అనంతరం నస్కల్‌లోని కస్తూర్బాగాంధీ పాఠశాలను సందర్శించారు. విద్యారినులు అస్వస్థతకు గురికావడానికి కారణాల గురించి వారు సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు.

రోగుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

- వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్
- ఆస్పత్రి సూపరింటెండెంట్‌పై ఆగ్రహం
- రోగులు నిలబడకుండా చికిత్సలు అందించాలని ఆదేశం



పరిగి ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

పరిగి, జూన్ 28: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగుల పట్ల నిర్లక్ష్యంచేస్తే కఠిన చర్యలు తప్పవని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్ జైన్ హెచ్చరించారు. కేజీబీవీ విద్యార్థినులు అస్వస్థతకు గురికాగా ఆయన పరామర్శించడానికి వెళ్లారు. రోజూ ఎంత మంది ఓపీ పేషెంట్లు వస్తున్నారు? వారందరికీ చికిత్స అందుతుందా? అని అడిగి తెలుసుకున్నారు. రోగుల పేర్ల రిజిష్టర్ కౌంటర్ వద్ద గుంపులుగుంపులుగా కనిపించడంపై కలెక్టర్ వారి దగ్గరకు వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. ఇంతమంది ‘సమిగుడితే ఏం చేస్తున్నారని డాక్టర్లు, సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. రిజిష్టర్ తర్వాత చేసుకోవచ్చని, ముందుగా ఆధార్ చూపించగానే చికిత్సలు అందించాలని సూచించారు. రోగులు గుంపులుగా కనిపించకూడదని, ఎందుకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయలేదని ఆస్పత్రి సూపరిండెంట్ రాజశేఖర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులకు చికిత్సలు అందించడంలో వైద్య సిబ్బంది ఒళ్లు దగ్గర పెట్టుకుని సేవలు అందించాలన్నారు. రోగులకు చికిత్స, విధుల పట్ల ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా ఇంటికి పంపిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రేణుకాదేవి, డీసీహెచ్‌వో ప్రదీప్, ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజశేఖర్, తహసీల్దార్ ఆనంద్ రావు, ఎంఈవో హరిశ్చందర్ పాల్గొన్నారు.

వర్షాల కోసం అన్నదాతల ఎదురుచూపులు



బండవెల్కిచర్ల గ్రామ పరిధిలో విత్తనాలు నాటడానికి సిద్ధం చేసిన పొలం

కులకచర్ల, జూన్ 28: వర్షాల కోసం అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. రోజూ మేఘాలు కమ్ముకుంటున్నా వర్షాలు మాత్రం కురువకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. రాష్ట్రమంతా విస్తారంగా వర్షాలు కురుస్తున్నా కులకచర్ల ప్రాంతంలో ఆశించిన వర్షాలు కురవడం లేదు. ఇప్పటికీ ఈప్రాంతంలో పూర్తిస్థాయిలో విత్తనాలు నాటలేదు. రోహిణీ కార్తెలో కొద్దిపాటి వర్షాలు కురువగా కొంతమంది రైతులు అక్కడక్కడ విత్తనాలు నాటారు. అయితే అవి మొలకెత్తినా వర్షాలు లేక వాడుముఖం పడుతున్నాయి. చాలా గ్రామాల్లో రైతులు ఇంకా విత్తనాలు నాటడానికి పొలాలను సిద్ధంచేసి ఉంచారు. కురిసిన కొద్దిపాటి వర్షాలకు గుట్టలపై ఉన్న, పొలాల్లో ఉన్నచెట్లు పచ్చబడ్డాయి. కానీ పంటలు పూర్తి స్థాయిలో సాగుకు నోచుకోలేదు. దీంతో వరుణుడి రాక కోసం రైతన్నల ఎదురుచూపులు తప్పడంలేదు.

ప్రమాదకరంగా గుంత



ఎల్లకొండలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా ఉన్న గుంత

నవాబుపేట, జూన్ 28: మండలంలోని ఎల్లకొండలో కావలి గోపాల్ ఇంటి సమీపంలో పెద్ద గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. దీంతో వాహనదారులు ప్రమాదవశాత్తు పడిపోయి గాయాలపాలవుతున్నారు. గుంతను తవ్వి రెండు నెలలు గడుస్తున్నా నేటికీ పూడ్చకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదని స్థానికులు వాపోయారు. వర్షాకాలం కావడంతో గుంతల్లో నీరుచేరి ఆ మార్గంలో వచ్చీపోయే వారికి గుంత కనిపించడంలేదు. దీంతో వాహనదారులు ప్రమాదబారిన పడుతున్నారు. ఈ గుంతల్లో వర్షపు నీరు నిలిచి దోమలు ప్రబలే అవకాశముందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మిని వివరణ కోరగా గుంతపడిన విషయం తమ దృష్టికి రాలేదని తెలిపారు. గుంతను రెండు రోజుల్లో పూడ్చివేయిస్తామని ఆమె తెలిపారు.

తాండూరుకు తాకిన ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం

- ఎన్నికల ముందు డాక్టర్ సంపత్ కుమార్ ఫోన్ ట్యాపింగ్
- నిర్ధారించిన విచారణ అధికారులు



డాక్టర్ సంపత్ కుమార్

తాండూరు, జూన్ 28: సెల్‌ఫోన్ ట్యాపింగ్ వ్యవహారానికి సంబంధించి ఇప్పటికే కొంత మంది అధికారులు జైల్లో ఉన్న సంగతి విదితమే. రాష్ట్ర వ్యాప్తంగా గత ప్రభుత్వ హయాంలో సెల్‌ఫోన్ ట్యాపింగ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం బయటపెట్టి విచారణ జరుగుతున్న విషయం విదితమే. ఈ క్రమంలో తాండూరుకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సంపత్ కుమార్‌కు చెందిన రెండు సెల్‌ఫోన్లు ట్యాపింగ్ జరిగినట్లు విచారణ అధికారులు నిర్ధారించారు. హైదరాబాద్ ఫిలింనగర్‌కు చెందిన పోలీస్ అధికారి ఒకరు డాక్టర్ సంపత్ కుమార్‌కు ఫోన్ చేసి శాసనసభ ఎన్నికల ముందు మీ రెండు ఫోన్లు ట్యాపింగ్ జరిగాయని వివరించారు. అయితే ఇది తను ఊహించిందేనని డాక్టర్ సంపత్ కుమార్ విచారణ అధికారికి వివరించారు. డాక్టర్ సంపత్ కుమార్‌కు చెందిన సెల్‌ఫోన్లు ఎవరు ట్యాపింగ్ చేయించారని విషయమై చర్చనీయమైంది. శాసన సభ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో కొనసాగిన సంపత్ కుమార్ పార్టీ మారి కాంగ్రెస్‌లో చేరడంతో పాటు కాంగ్రెస్ పార్టీ తాండూరు ఎమ్మెల్యే టికెట్ కూడా ఆశించారు. కాంగ్రెస్‌లో కీలకమైన వ్యక్తిగా వ్యవహరించిన డాక్టర్ సంపత్ కుమార్ ఫోన్లు ట్యాపింగ్ చేసిన వ్యక్తులు పోలీస్ విచారణలో బయటపడే అవకాశం ఉంది.

చీఫ్‌విప్ బాధ్యతలు చేపట్టని ఎమ్మెల్సీ

- మంత్రి పదవిపై ఆశలు



మహేందర్‌రెడ్డి

తాండూరు, జూన్ 28: త్వరలో మంత్రివర్గ విస్తరణ ఏర్పడుతుందని వస్తున్న వార్తలతో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ, మాజీ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి తనకు వచ్చిన ప్రభుత్వ చీఫ్‌విప్ పదవిని ఇంకా చార్జ్ తీసుకోవడం లేదు. మహేందర్‌రెడ్డికి ప్రభుత్వ చీఫ్‌విప్ పదవిని కట్టబెడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 15న జీవో 103ను విడుదల చేసింది. ఎన్నికల కోడ్ దృష్టిలో పెట్టుకొని చార్జి తీసుకోకుండా నెట్టుకొచ్చారు. ప్రస్తుతం కోడ్ గడువు ముగిసినా ప్రభుత్వ చీఫ్‌విఫ్ పదవిని చార్జి తీసుకోకుండా ఉంటున్నారు. చార్జి తీసుకుంటే ఆపదవికే పరిమితం కావాల్సి వస్తుందని, మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. ఈమేరకు తన ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు సమాచారం. ఇప్పటికే ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యేలుగా మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి రేసులో ఉన్నారు. అవకాశం వస్తే మంత్రి పదవిని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆశిస్తున్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పట్టు కోసం మాజీ మంత్రి ఎమ్మెల్సీ మహేందర్‌రెడ్డి తనకు అవకాశమున్న ప్రయత్నాలు చేపడుతున్నారు. ఇప్పటికే బెంగళూరులో వారం రోజుల కిందట మకాం వేసి అక్కడ కాంగ్రెస్ ముఖ్య నాయకుల ద్వారా ప్రయత్నాలు చేపట్టినట్లు తెలుస్తోంది.

మూడు కిలోల క్లోరల్ హైడ్రేట్ పట్టివేత

- బషీరాబాద్‌లో కల్లులో కలిపే మత్తు పదార్థం గుర్తింపు
- వ్యక్తిపై కేసు నమోదు

బషీరాబాద్, జూన్ 28: ఓ వ్యక్తి మూడు కిలోల క్లోరల్ హైడ్రేట్ తరలిస్తుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలంలో హెడ్‌కానిస్టేబుల్ మల్లేషం ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది శుక్రవారం గస్తీ నిర్వహిస్తుండగా, స్థానిక నవాంద్గీ రైల్వే స్టేషన్‌వద్ద ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. సదరు వ్యక్తిని తనిఖీ చేయగా అతడి వద్ద సీహెచ్(క్లోరల్ హైడ్రేట్) కల్లులో కలిపే 3 కిలోల మత్తుపదార్థం లభించింది. బషీరాబాద్‌లోని కొడంగల్ రాజుగౌడ్ వద్ద నుంచి సీహెచ్ తీసుకెళ్తున్నానని, తన పేరు రాజేష్‌చౌహాన్, కర్ణాటక ప్రాంతామని తెలపగా, నిందితుడిని అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొంతకాలంగా కర్ణాటక నుంచి సీహెచ్‌ను పెద్ద ఎత్తున తీసుకొచ్చి బషీరాబాద్ కేంద్రంగా కొందరు విక్రయిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైనట్లు తెలిసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్‌కుమార్ తెలిపారు.

విరబూసిన బ్రహ్మకమలాలు



ఘట్‌కేసర్: ఎన్ఎఫ్‌సీనగర్‌లో విరబూసిన బ్రహ్మకమలాలు

ఘట్‌కేసర్, జూన్ 28: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీ నగర్‌లో బ్రహ్మ కమలాలు విరబూశాయి. ఎన్ఎఫ్‌సీనగర్‌లోని బీ-1లో నివాసముండే అలపాటి మల్లిఖార్జున్ రావు ఇంటి ఆవరణలో అనేక రకాల పూలమొక్కలు, పండ్లచెట్లతోపాటు వివిధ రకాల తీగజాతి మొక్కలను పెంచుతున్నాడు. గురువారం రాత్రి ఆయన ఇంట్లోని బ్రహ్మకమలం చెట్టుకు ఒకటికాదు రెండు కాదు ఏకంగా ఆరు పువ్వులు వికసించాయి. కేవలం రాత్రి సమయంలోనే పుష్పించే ఈపుష్పాలు సూర్యోదయంతో వాడిపోతాయి. బ్రహ్మకమలం పుష్పాలు వికసించిన విషయం తెలుసుకున్న స్థానికులు వాటిని చూసేందుకు మల్లిఖార్జున్‌రావు నివాసానికి బారులుతీరారు.

కొడంగల్ రూరల్: శివుడికి ప్రీతిపాత్రమైన, అరుదుగా పుష్పించే బ్రహ్మ కమలాలు కొడంగల్‌లోని లాహోటీ కాలనీలో ఓ ఇంటి ఆవరణలో గురువారం రాత్రి వికసించాయి. లాహోటీ కాలనీలో నివాసముండే అధ్యాపకుడు బత్తుల మల్లయ్య ఇంటి పెరట్లో నాలుగు బ్రహ్మ కమలాలు వికసించడంతో కుటుంబ సభ్యులు, కాలనీవాసులు పుష్పాలకు పూజలు చేశారు.

గౌరవ వేతనాలు తక్షణమే చెల్లించాలి: చింపుల

రంగారెడ్డి అర్బన్, జూన్ 28 : జడ్పీటీసీలకు, ఎంపీపీలకు గౌరవ వేతనాలు వెంటనే ఇవ్వాలని తెలంగాణ పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చింపుల సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జడ్పీటీసీలు, ఎంపీటీసీల పదవీకాలం జూలై 4 వరకు ముగియనున్నట్లు చెప్పారు. ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం వెంటనే ఇవ్వాలని కోరారు. దేశంలో అత్యంత కీలకమైన పంచాయతీరాజ్ వ్యవస్థ, గ్రామాల పటిష్టతకు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఎంతో కృషి చేశారని వారికి గౌరవ వేతనాలను ఇవ్వక పోవడం అవమానకరమన్నారు.

గెస్ట్ లెక్చరర్లకు దరఖాస్తుల ఆహ్వానం

వికారాబాద్, జూన్ 28: వికారాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ సబ్జెక్టులు బోధించడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.మల్లయ్య శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంగ్లీష్, పొలిటికల్ సైన్స్, మ్యాథ్స్, ఫిజిక్స్ కంప్యూటర్ సైన్స్, జువాలజీ, బోటనీ, కామర్స్ సబ్జెక్టుల్లో ఒక్కో పోస్టు ఉందని తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు సంబంధిత సబ్జెక్టుల్లో పీజీలో ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 50శాతం, ఇతరులకు 55శాతం మార్కులు ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత ఉండి, బోధనా అనుభవం గల వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. పీహెడీ, నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులు అందుబాటులో లేకపోతే అర్హులైన పీజీ అభ్యర్థులను తీసుకుంటామని వివరించారు. అర్హులైన అభ్యర్థులు జూలై 2వ తేదీ, సాయంత్రం 4గంటల వరకు తమ దరఖాస్తులపై కళాశాలతో అందజేయాలని సూచించారు. ఇతర వివరాలకు 9347053673, 98660 99526 నంబర్లలో సంప్రదించాలని ప్రిన్సిపాల్ కోరారు.

ఓగీపూర్ నాపరాతి గనుల్లో విద్యుత్ లైన్లపై సర్వే

తాండూరు రూరల్, జూన్ 28: మండలంలోని కరన్‌కోట్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ నుంచి ఓగీపూర్ నాపరాతి గనుల వరకు ఐదున్నర కిలోమీటర్ల దూరంలో 11కేవీ విద్యుత్ వైర్లను పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించినట్లు తాండూరు మండల విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ కె.వెంకట్‌నాయడు తెలిపారు. మండలంలోని ఓగీపూర్ నాపరాతి గనిలో ముందస్తుగా విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండేందుకు శుక్రవారం సర్వే నిర్వహించినట్లు తెలిపారు. ఈసర్వేలో విద్యుత్ సరఫరా జరుగుతుందా, విద్యుత్ వైర్లకు చెట్ల కొమ్మలు ఏమైనా తగులుతున్నాయా, నాపరాతి పాలిషింగ్ యూనిట్ల వినియోగదారులకు ఇబ్బందులు ఏమైనా కలుగుతున్నాయా అనేదానిపై తమ సిబ్బందితో వెళ్లి వినియోగదారులు క్షేత్రస్థాయిలో పర్యటించి వివరాలు తెలుసుకున్నట్లు తెలిపారు. ముందస్తుగా విద్యుత్ సరఫరాలో అంతరాయాన్ని అరికట్టేందుకే సమగ్ర సర్వే నిర్వహించినట్లు తెలిపారు. కరన్‌కోట్ సబ్‌స్టేషన్‌లో 33/11కేవీ ద్వారా నాపరాతి పాలిషింగ్ యూనిట్లకు ఏమేరకు సరఫరా జరుగుతుందని, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా? అనేదానిపై వివరాలను సేకరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్‌ఇన్‌స్పెక్టర్ గరివప్ప, జూనియర్ లైన్‌మన్ సాయిరాజు, ఆర్టీజన్ ఎండీ మౌలానా, వినియోగదారులు రియాజ్, రవి పాల్గొన్నారు.

భూములకు పట్టాదారు పాస్ బుక్కులివ్వాలి

శంషాబాద్, జూన్ 28 : తమ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులందరికీ కొత్త పట్టాపాసుపుస్తకాలు ఇవ్వాలని శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి కొత్వాల్‌గూడ రైతులు శుక్రవారం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు. రైతులు, గ్రామస్తులు మాట్లాడుతూ సుమారు 100 సంవత్సరాలుగా రైతులు కొత్వాల్‌గూడలో భూమి సాగుచేసుకొని జీవనం సాగిస్తున్నారన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి గత ప్రభుత్వం 38-ఈ కింద అన్ని హక్కులు కల్పించి పట్టాపాసుపుస్తకాలిచ్చిందని తెలిపారు. దీంతో రైతులు భూముల క్రయవిక్రయాలు జరిపే అవకాశం కలిగిందన్నారు. రైతుబంధు, బీమా, రుణమాఫీ పథకాలను సైతం పొందామన్నారు. ధరణి పోర్టల్‌లో మాత్రం కొత్వాగూడ రైతుల భూములను నిషేధిత జాబితాలో చేర్చారని తెలిపారు. అప్పటి నుంచి రైతులకు పథకాలు రావడం లేదన్నారు. నిషేధాన్ని ఎత్తివేసి రైతులకు కొత్త పట్టాపాసుపుస్తకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కొత్వాల్‌గూడ మాజీ సర్పంచ్ పి.శ్రీనివాస్‌గౌడ్, ప్యాక్స్ వైస్‌చైర్మన్ జ్ఞానేశ్వర్, డైరెక్టర్ శ్రీనివాస్, రాజేష్‌గౌడ్, పలువురు రైతులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో విద్యార్థి నాయకులపై సస్పెన్షన్ ఎత్తివేయాలి

ఇబ్రహీంపట్నం, జూన్ 28: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నాయకుల సస్పెన్షన్, అలాగే అక్రమంగా పెట్టిన కేసులను ఎత్తివేయాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు బి.వంశీ, తరంగ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో నిరసన తెలిపి వీసీ దిష్టిబొమ్మను దహనం చేశారు. హెచ్‌సీయూ విద్యార్థి సంఘం అధ్యక్షుడు అతిక్‌అహ్మద్, మరో 9 మంది విద్యార్థులను ఆరు నెలల పాటు సస్పెండ్ చేయడమేగాక 10వేల రూపాయల చొప్పున జరిమానా విధించారన్నారు. దీనిని వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, శివ, చందులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలు అమ్మితే కఠిన చర్యలు

షాబాద్, జూన్ 28: నిషేధిత మత్తుపదార్థాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి తెలిపారు. శుక్రవారం షాబాద్, హైతాబాద్‌లో పాన్‌షాప్, కిరాణా షాప్‌లపై తనిఖీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ఇండస్ట్రియల్ పరిధిలో ఉన్న హైతాబాద్ గ్రామంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఉద్యోగులు అధిక మొత్తంలో పనిచేస్తున్నారని, ఇక్కడ మత్తు పదార్థాలు విక్రయంపై నిఘా పెట్టినట్లు తెలిపారు. ఎవరైనా నిషేధిత మత్తు పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

రంగారెడ్డి జిల్లా ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ప్రారంభం

హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా పరిధిలోని ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ శుక్రవారం ప్రారంభమైంది. తొలి రోజు... ఖాళీల వివరాలతోపాటు సీనియారిటీ జాబితాను ప్రకటించారు. మొత్తం ప్రక్రియ 8 రోజుల పాటు కొనసాగి జూలై 5న ముగియనుంది. బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన అధికారులను ఆదేశించారు.

మురికి కూపంగా కూరగాయల మార్కెట్

» రోగాల భయంతో ప్రజల ఆందోళన

షాద్‌నగర్ రూరల్, జూన్ 28 : షాద్‌నగర్‌లోని ఈడెన్ గార్డెన్ వద్ద ఏర్పాటు చేసిన కూరగాయల మార్కెట్ మురికి కూపంగా మారింది. మార్కెట్‌కు పోతే రోగాలు వస్తాయేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పట్టణ కేంద్రంలో కూరగాయల మార్కెట్ ఇంత అధ్వానంగా ఉందని విచారం వ్యక్తం చేస్తున్నారు. కరోనా సమయంలో గంజ్ పక్కనున్న కూరగాయల మార్కెట్‌ను వారాంతాలుగా కాలనీలకు మార్చారు. హాజిపల్లి-పరిగి రోడ్డు మధ్యలో ఈడెన్ ప్లాజా-షాహీ గార్డెన్ వద్ద మార్కెట్ ఏర్పాటు చేశారు. ఇదే పెద్ద కూరగాయల మార్కెట్. కానీ అక్కడ మురుగుమయంగా మారింది. కొంత సీసీ రోడ్డు వేసినా దానిపై మట్టి చేరి వర్షం పడ్డప్పుడు బురదగా మారుతోంది. పరిగి రోడ్డు నుంచి హనుమాన్ ఆలయం సీసీ రోడ్డు పాడైపోయింది. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరి మడుగులు తయారవుతున్నాయి. కుళ్లిన కూరగాయలతో దుర్వాసన వస్తోంది. కొత్తగా సీసీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

అయ్యప్ప కాలనీ రోడ్డులో ఇలా

అయ్యప్ప కాలనీకి వెళ్లే రోడ్డులో మరో కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేశారు. అక్కడా మార్కెట్‌కు సౌకర్యవంతంగా లేదు. గతంలో రోడ్డుకు ఇరువైపుల ఉన్న దుకాణాలను తడకలతో ఏర్పాటు చేసుకున్నారు. వర్షం కురిస్తే విక్రయ, కొనుగోలు దారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్నేళ్లుగా లక్ష్మీనర్సింహా కాలనీలో ఉన్న కూరగాయల మార్కెట్ ప్రజలకు సౌకర్యవంతంగా లేదు. సందులో ఉంది. వానకాలంలో బురదమయం అవుతోంది.

శాశ్వత కూరగాయల మార్కెట్‌ను ఏర్పాటు చేయాలి

కరోనా సమయంలో రెండు, మూడు మార్కెట్‌లుగా విభజించిన కూరగాయల మార్కెట్‌కు పూర్తిగా శాశ్వత మార్కెట్‌ను అన్ని సౌకర్యాలతో ఏర్పాటు చేయాలని పట్టణ వాసులు కోరుతున్నారు. పదేళ్ల కింద పట్టణంలోని లక్ష్మీ నర్సింహ కాలనీలో నిర్మించిన మాంసం విక్రయశాల వృథాగా ఉంది. శాశ్వత మార్కెట్ ఏర్పాటుతో మాంసం విక్రయాలు ఒకేచోట జరిగేలా సదుపాయాలు కల్పించాలని



కూరగాయల దుకాణం ముందు నీటి గుంత



గిరాకీ రావడం లేదు

రోడ్డులో మురుగు నీరు చేరి దుర్వాసన వస్తోంది. ఈ మురుగులో కూరగాయలు కొనేందుకు ప్రజలు రావడం లేదు. మేం మార్కెట్ నుంచి తెచ్చిన కూరగాయలు కొనేవారు రాక ముగురుతున్నాయి. నీరు నిల్వ ఉండకుండా గుంతలను మట్టితో పూడ్చాలి.

- ఖదీర్, కూరగాయల వ్యాపారి

అటవీ రేంజ్‌ను పీడిస్తున్న సిబ్బంది కొరత

» నాలుగేళ్లుగా ఇన్‌చార్జి రేంజర్ కొనసాగింపు
» ఖాళీగా తొమ్మిది బీట్ అధికారుల పోస్టులు
» ఆక్రమణకు గురవుతున్న అడవి

ధారూరు, జూన్ 28: ధారూరు అటవీరేంజ్‌ను చాలాకాలంగా సిబ్బంది కొరత పట్టిపీడిస్తోంది. నాలుగేళ్లుగా రేంజర్ పోస్టు ఖాళీగా ఉండటంతో ఇన్‌చార్జి రేంజర్‌ను కొనసాగిస్తున్నారు. బీట్ అధికారులు పోస్టులూ ఖాళీగా ఉన్నాయి. దీంతో జిల్లాలోనే పెద్ద అడవిగా పేరున్న ధారూరు అడవి ఆక్రమణకు గురవుతోంది. ఏటా అటవీ ప్రాంతంలో విలువైన చెట్లను నరికి ఎకరాల కొద్దీ అటవీ భూమిని ఆక్రమించి ఆక్రమార్కులు సాగు చేసుకుంటున్నారు. రేంజ్‌లో సిబ్బంది కొరత పాటు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవటం, అడవి ఆక్రమణను నిరోధించటానికి కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి అటవీ అధికారులు జంకుతుండటంతో అడవి నాశనమవుతుందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ధారూరు అటవీరేంజ్‌లో ధారూరు, కోట్‌పల్లి, యాలాల్, పెద్దేముల్ మండలాల పరిధిలో దాదాపు 20వేల ఎకరాల విస్తీర్ణంలో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. రేంజ్‌లో నాలుగు సెక్షన్లు, 12బీట్‌లు ఉన్నాయి.



ధారూరు అటవీ రేంజ్ కార్యాలయం

నాలుగేళ్లుగా ఇన్‌చార్జి రేంజరే

ధారూరు అటవీరేంజ్ నాలుగేళ్లుగా ఇన్‌చార్జి రేంజర్‌తోనే కొనసాగిస్తున్నారు. ఇక్కడ రేంజర్‌గా పనిచేసిన వెంకటయ్యగౌడ్ 2020లో బదిలీపై వెళ్లిన తర్వాత రేంజ్‌కు ఇంత వరకు పూర్తి స్థాయి రేంజర్‌ను నియమించలేదు. ఈయన స్థానంలో ఇంచార్జి రేంజర్‌గా కొనసాగిన రేంజర్ కృష్ణ గత మార్చి 31న ఉద్యోగ విరమణ చేయటంతో వికారాబాద్ రేంజ్ రేంజర్ అరుణకు ధారూరు రేంజ్ రేంజర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. ఇన్‌చార్జి రేంజర్ అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండగా డీఎఫ్ఆర్‌వో, సెక్షన్ అధికారులు, బీట్ అధికారులు అటవీ సంరక్షణ బాధ్యతలను నిర్వహిస్తున్నారు. కాగా రేంజ్‌లోని 12బీట్లకు ముగ్గురు బీట్ అధికారులే విధులు నిర్వహిస్తుండగా, తొమ్మిది మంది బీట్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ముగ్గురిలో ఒకరికి గురుకుల కళాశాల లెక్చరర్ పోస్టు రావటంతో మరో బీట్ అధికారి పోస్టు త్వరలో ఖాళీకానుంది. బీట్ అధికారుల నియామకాలు జరగకపోవటంతో ఏళ్ల తరబడి ఈ పోస్టులు ఖాళీగానే ఉంటున్నాయి. దీంతో ఉన్న బీట్ అధికారులపై పనిభారం పెరిగి మానసికంగా ఒత్తిడికి గురవుతున్నారు. క్షేత్రస్థాయిలో అడవిని సంరక్షించే బీట్ అధికారులే లేకపోవడంతో అటవీ ప్రాంతం నరికివేతకు గురవుతోంది.

ఆక్రమణకు గురవుతున్న అడవి

ధారూరు రేంజ్‌లో సరైన సిబ్బంది లేకపోవడంతో ఆక్రమార్కులు అడవిని ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. ఏటా అడవి నరికివేతకు గురై పెద్దపెద్ద విలువైన చెట్లు నేలమట్టమవుతున్నాయి. రాస్నం సెక్షన్‌లో అడవి ఎక్కువగా ఆక్రమణకు గురవుతున్నా అధికారులు అడ్డుకోలేకపోతున్నారు. అడవులు నాశనమవుతుండటంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లి వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశముందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీశాఖ ఉన్నతాధికారులు స్పందించి అటవీ రేంజ్‌లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి అడవిని కాపాడాలని మండల ప్రజలు కోరుతున్నారు.



దోర్నాల్ అడవిలో నరికిన చెట్లు(ఫైల్)

తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం

» టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, జూన్ 28 : తెలంగాణలో టీడీపీకి పూర్వ వైభవం వస్తుందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలంలోని లింగారెడ్డిగూడలో శుక్రవారం టీడీపీ జెండా పం డుగ నిర్వహించారు. బక్కని నర్సింహులు జెం డాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. ఏపీలో అరాచక పాలనను అంతం చేసి, టీడీపీ అఖండ విజయం సాధించడంతో తెలంగాణాలోని తెలుగు తమ్ముళ్లలో నూతనోత్సాహం నెలకొందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామంలో టీడీపీ జెండా పండుగ ప్రారంభమైనాయని తెలిపారు. వచ్చే నాలుగున్నరేళ్లలో అధికారమే లక్ష్యంగా పార్టీని బలోపేతం చేస్తామన్నారు. 2014 ఎన్నికల్లో గెలిచిన 15 మంది టీడీపీ ఎమ్మెల్యేలను, 2019లో గెల్చిన ఇద్దరు టీడీపీ ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో చేర్చుకున్న మాజీముఖ్యమంత్రి కేసీఆర్ ఇప్పుడు పార్టీ ఫిరాయింపులపై మాట్లాడడం హాస్యాస్పందం అన్నారు. తాను ఇతర పార్టీల ఎమ్మెల్యేలను చేర్చుకుంటే తప్పులేనిది, ఇప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఇతర పార్టీలోకి వెళ్తే తప్పెలా అవుతుందని ప్రశ్నించారు. పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించింది కేసీఆరే అన్నారు. అధికారం ఉందని అడ్డగోలుగా వ్యవహరిస్తే ప్రజలు గుణపాఠం చెప్పారని రెండు రాష్ట్రాల్లో నిరూపితమైందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు చల్లా వెంకటేశ్వర్ రెడ్డి, కుమార్‌గౌడ్, వెంకటయ్యగౌడ్, ఆనంద్, అంజయ్యగౌడ్, భాస్కర్‌రెడ్డి, నర్సింహులు, కృష్ణయ్య, భూపతిరెడ్డి, బాబునాయక్ పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు

గంధోత్సవాలను విజయవంతం చేయాలి

ఆమనగల్లు, జూన్ 28 : హైదరాబాద్ పురాణపూల్‌లో జూలై 1న 4వ ఉర్సు గంధోత్సవాన్ని నిర్వహిస్తామని ఆమనగల్లు మహ్మదీయ మజీద్ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ ఖాద్రీ, నయాబ్ సదర్ మహ్మద్ అబ్దుల్ ఖాద ర్ తెలిపారు. గంధోత్సవంలో ముస్లింలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఆమనగల్లు శుక్రవారం వేడుకలపై సన్నాహక సమావేశం నిర్వహించిన కరపత్రాలు, వాల్‌పోస్టర్లను ఖాదర్‌ఖాద్రీ ఆవిష్కరించారు.

నీట్ రాసిన విద్యార్థులకు న్యాయం చేయాలి

మేడ్చల్ టౌన్, జూన్ 28 : నీట్ పరీక్ష రాసిన 24లక్షల మంది విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు ప్రజాప్రతినిధుల ఇళ్లను ముట్టడిస్తామని యువజన విద్యార్థి సంఘాల ఐక్యకార్యాచరణ సమితి డిమాండ్ చేసింది. శుక్రవారం విద్యార్థి సంఘాల నాయకులు మేడ్చల్ మండలం పూడూరు గ్రామ శివారులోని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ ఇంటి ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థి సంఘం నేతలు మాట్లాడుతూ...నీట్ పరీక్ష రాసి నష్ట పోయిన తెలుగు రాష్ట్రాల విద్యార్థుల గురించి కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించని బీజేపీ ఎంపీలను తిరగనివ్వమని హెచ్చరించారు. ఎన్నో ఆశలతో నీట్ పరీక్షకు ప్రిపేయిర్ అయిన లక్షలాది మంది విద్యార్థులను మోసం చేసే విధంగా నీట్ పరీక్షలు నిర్వహించారన్నారు. కేవలం కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా నీట్ విద్యార్థులు నష్టపోయారన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగేంత వరకు విద్యార్థి సంఘాల నాయకులు వారికి అండగా నిలిచి పోరాడుతామని తెలిపారు. కేంద్రం ప్రభుత్వం దిగి వచ్చి విద్యార్థులకు న్యాయం చేసేంత వరకూ తమ ఉద్య మాన్ని ఆపే ప్రసక్తి లేదన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఏఐఎఫ్ కార్యదర్శి టి.సత్యప్రసాద్, ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్ యాదవ్, ఏఐఎఫ్ఎస్ జిల్లా నాయకుడు మహేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ ఈటల రాజేందర్ ఇంటి ఎదుట నిరసన చేపడుతున్న విద్యార్థి సంఘాల నేతలు

రాంగ్‌నెంబర్‌తో పరిచయమై బాలికకు వేధింపులు

» నిందితుడు నెల్లూరి వాసిగా గుర్తింపు
» పోక్సో కేసు నమోదు, రిమాండ్ తరలింపు

తాండూరు రూరల్, జూన్ 28: రాంగ్‌నెంబర్‌తో పరిచయమైన ఓ యువకుడు బాలికను వేధింపులకు గురిచేసి చివరకు జైలుపాలయ్యాడు. కరన్‌కోట్ ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన పథనం ప్రకారం.. తాండూరు మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) కొన్ని నెలల కిందట తన ఫోన్‌తో స్నేహితురాలికి ఫోన్ చేయబోయి ఏపీలోని నెల్లూరు జిల్లాకు చెందిన శ్రీనివాస్‌కు ఫోన్ చేసింది. ఆ రాంగ్‌నెంబర్ ఆధారంగా శ్రీనివాస్ మైనర్ బాలికతో స్నేహం పెంచుకున్నాడు. వాట్సాప్‌లో చాటింగ్, ఇన్‌స్టాగ్రామ్‌లో మెస్సేజ్‌లతో వారిమధ్య మాటలు కలిశాయి. ఫోన్‌లో ఆ బాలికను శ్రీనివాస్ అసభ్యకరమైన మాటలతో హింసించడం మొదలుపెట్టాడు. దీంతో విషయాన్ని బాలిక తన తల్లిదండ్రులతో తెలపడంతో వారు కరన్‌కోట్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు సదరు యువకుడి ఫోన్‌నెంబర్ ఆధారంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన శ్రీనివాస్‌గా గుర్తించారు. అతన్ని శుక్రవారం కరన్‌కోట్ పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.



నిందితుడు శ్రీనివాస్‌ను మీడియా ఎదుట ప్రవేశపెట్టిన పోలీసులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

నందిగామ, జూన్ 28: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం పనిచేస్తోందని, ఇప్పటికే హామీలను నెరవేర్చుతున్నామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం నందిగామలో కోటి రూపాయలతో నిర్మిస్తున్న ఎంపీడీవో కార్యాలయానికి, డ్వా క్రా భవనానికి ఎమ్మె ల్యే, జడ్పీ చైర్‌పర్సన్ అనితారె డ్డి, వైస్‌చైర్మన్ గణేష్ శంకుస్థాపన చేశారు.మండల కేంద్రంలో నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. అనంతరం అంతిరెడ్డిగూడలో మహిళా సమాఖ్య భవనం, అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభించి పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నర్సప్పగూడలో జడ్పీ నిధులు 20లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను వారు ప్రారంభించారు. చేగూర్‌లో ఎంపీపీ నిధులతో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్లను ప్రార ంభించారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే, జడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ గ్రామాల్లో వసతుల కల్పించేందుకు కృషిచేస్తామన్నారు. రాజకీయాలకు అతీతంగా మండలాన్ని అన్ని రంగా ల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మె ల్యే అన్నారు. మాజీ ప్రధాని పీవీ. నర్సింహరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నా యకులు నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ రాజేశ్వర్, ఎంపీడీవో సుమతి, ఎంపీపీ ప్రియాంకశివశంకర్‌గౌడ్, వైస్‌ఎంపీపీ మంజుల, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, దేపల్లి కుమార్, చంద్రపాల్ రెడ్డి, రాజునాయక్, లత శ్రీశైలం, ఎంకిర్యాల కళమ్మ, కాంగ్రెస్ నాయకులు నర్సింలు, శివశంకర్‌గౌడ్, జిల్లెల్ల బాల్‌రెడ్డి, జిల్లెల్ల రాంరెడ్డి, తుమ్మల నర్సింలు, లింగం, జం గయ్యగౌడ్, కృష్ణాగౌడ్, సాములయ్య, బుచ్చ య్య, శ్రీశైలం, రాజశేఖర్ పాల్గొన్నారు.



మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, తదితరులు

మెరుగైన వసతులు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయం

కడ్తాల్, జూన్ 28: ప్రజలకు మెరుగైన వసతుల కల్పించడమే కాంగ్రెస్ ప్రజాపాలన ధ్యేయం అని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల అభివృద్ధికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోందని పేర్కొన్నారు. కడ్తాల మండలం మైసిగండి మైసమ్మ ఆలయ సమీపంలో రూ.15లక్షలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణం పనులకు శుక్రవారం ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, జడ్పీటీసీ దశరథ్‌నాయక్, స్థానిక మాజీ సర్పంచ్ తులసీరామ్‌నాయక్, ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ హైదరాబాద్- శ్రీశైలం జాతీయ రహదారిని నాలుగు లేన్ల విస్తరణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారని, కేంద్రం సానుకూలంగా స్పందించిందని చెప్పారు. నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలు, తండాలకు వచ్చే ఏడాది లోపు బీటీ రోడ్లు నిర్మిస్తామని పేర్కొన్నారు. గ్రామాల్లో మిగిలిపోయిన అంతర్గత రోడ్లను సీసీగా మార్చి కొత్త కాలనీల్లో డ్రెయిన్ల నిర్మాణం చేపడుతామని చెప్పారు. మైసిగండి ఆలయం వద్ద భక్తులకు వసతులు కల్పించి ఆలయ అభివృద్ధికి కృషిచేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కేఎల్ఐ డీ-82 కాల్వ అసంపూర్తి పనులు త్వరితగతిన పూర్తిచేయించి ఆమనగల్లు, వెల్దండ, మాడ్గుల మండలాల్లో 35వేల ఎకరాలకు సాగునీరందిస్తామన్నారు. కాల్వ నిర్మాణంతో భూములు కోల్పోయిన నిర్వాసిత రైతులకు రావాల్సిన పరిహారం త్వరగా చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరగా మంజూరుకు అధికారులకు ఆదేశించారని కసిరెడ్డి చెప్పారు. అంతకు ముందు మైసిగండి మైసమ్మ ఆలయంలో తన సతీమణి మాధవిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదలతో కసిరెడిని సత్కరించి ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కడ్తాలలో నిర్మాణం పూర్తైన కేజీబీవీ భవనాన్ని ప్రారంభించి విద్యార్థుల ఇబ్బందులు తీర్చాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని కోరారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, నాయకులు గూడూరు భాస్కర్ రెడ్డి, నరేశ్ నాయక్, పాండునాయక్, గురిగళ్ల లక్ష్మయ్యరాం చందర్ నాయక్, సత్యం యాదవ్, బాచిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జవహర్‌లాల్ నాయక్, తులసీరామ్ నాయక్, పంత్యానాయక్, డీఈ శ్రీనివాస్, ఏఈ పరమేశ్, సీఐ శివప్రసాద్, ఎంపీడీవో సుజాత, పంచాయతీ కార్యదర్శి సత్యం, మైసిగండి స్పెషలాఫీసర్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

సొంత డబ్బులతో రోడ్డు మరమ్మతులు

చేవెళ్ల, జూన్ 28: నాయకులు సొంత డబ్బులతో గుంతల రోడ్డును బాగుచేయించిన నాయకులను గ్రామస్తులు అభినందించారు. చేవెళ్ల మండలం రావులపల్లి రోడ్డు గుంతలు పడింది. శుక్రవారం రావులపల్లి మాజీ సర్పంచ్ గోటురి రాంచంద్రయ్య గౌడ్, ముడిమ్యాల్ ప్యాక్స్ డైరెక్టర్ కె.నరేందర్‌యాదవ్ ముడిమ్యాల్ నుంచి రావులపల్లి వరకు రోడ్డుపై మట్టి పోయించారు. గుంతల రోడ్డుకు మరమ్మత్తులు చేయడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, యువకులు తదితరులు ఉన్నారు.



రోడ్డును బాగుచేయిస్తున్న నాయకులు, గ్రామస్తులు

మునిసిపాలిటీ అభివృద్ధికి కృషి



మునిసిపల్ కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ మధుమోహన్

మహేశ్వరం, జూన్ 28 : రాజకీయాలతో సంబంధం లేకుండా తుక్కుగూడ మున్సిపాలిటీ అభివృద్ధి చేసుకుందామని, ఇందుకు మున్సిపల్ అధికారులకు పాలకవర్గం, ప్రజలు సహకరించాలని తుక్కుగూడ మున్సిపల్ చైర్‌పర్సన్ కాంటేకార్‌మధుమోహన్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ హైదరాబాదుకు చేరువలో ఉన్న తుక్కుగూడ మున్సిపాలిటీ అన్ని విధాలా మరింత అభివృద్ధి చెందాలన్నారు. అందుకు మున్సిపాలిటీ పరిధి అన్ని వార్డుల్లో అభివృద్ధి సమృద్ధిగా జరగాలన్నారు. తాగునీరు, రోడ్లు, విద్యుత్, మురుగు కాలువలు విద్య, వైద్యం వంటి అభివృద్ధితో పాటు పారిశుధ్యం వంటి పనుల్లో వేగం పుంజుకోవాలన్నారు. అలాగే వివిధ అభివృద్ధి పనుల కోసం తీర్మానాలు చేశామన్నారు. సమావేశంలో వైస్‌చైర్మన్ వెంకట్‌రెడ్డి, కమిషనర్ వెంకట్‌రామ్, కౌన్సిలర్లు యాదగిరిరెడ్డి, అనిత, శివకుమార్, మౌనిక, పద్మ, తేజస్విని, విలాస్, సుమన్, రవి నాయక్, భావన, లావణ్య పాల్గొన్నారు.

అమెజాన్ వెబ్ సర్వీసెస్ సేవలు అభినందనీయం



సీతారాంపూర్‌లో అంగన్‌వాడీ భవనం వద్ద నాయకులు

షాబాద్, జూన్ 28: విద్యార్థుల కోసం అమెజాన్ వెబ్‌సర్వీసెస్ సేవలు అభినందనీయమని ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి అన్నారు. షాబాద్ మండలం సీతారాంపూర్‌లో అంగన్‌వాడీ భవనం సుందరీకరణ పనులను అమెజాన్ వెబ్ సర్వీసెస్, సర్ఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చేపట్టిన పనులను ఎంపీడీవో అపర్ణ, ఎంపీటీసీ కుమ్మరి చెన్నయ్యలతో కలిసి శనివారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థుల కోసం అమెజాన్ వెబ్ సర్వీసు ఎంతో ఖర్చు చేస్తోందన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో భాగంగా సంస్థ మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. ప్రచారానికి పోకుండా సమాజాసేవ కోసం కోట్ల రూపాయాలు ఖర్చు చేస్తున్న అమెజాన్ వెబ్ సర్వీసు అందిస్తున్న సేవలను వారు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రమాదేవి, ప్రత్యేకాధికారి శారధ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ నర్సింహులుగౌడ్, మాజీ సర్పంచులు పాండురంగారెడ్డి, కృష్ణగౌడ్, సురేష్‌గౌడ్, అంగన్‌వాడీ టీచర్ మీన, అమెజన్ సెంటర్ అడ్వైజర్ శంకరన్, సర్ఫ్ సంస్థ ప్రతినిధులు సురేష్, నాగరాజు, పంచాయితీ కార్యదర్శి మల్లేష్ పాల్గొన్నారు.

అపర్ణ రియల్టీ ప్రహరీ కూల్చివేత

శంకర్‌పల్లి, జూన్ 28: కొండకల్‌లోని అపర్ణ రియల్టీ ప్రహరీని అధికారులు కూల్చివేశారు. అనుమతి లేకుంగా నిర్మిస్తున్న ప్రహరీని పంచాయతీ కార్యదర్శి ఎల్లయ్య ఎక్స్‌కవేటర్‌తో కూల్చేయించారు. అపర్ణ రియల్టీ యాజమాన్యం హెచ్ఎండీఏ, పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మిస్తుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాలతో గురువారం కూల్చివేశారు.

వ్యతిరేక మార్గంలో ప్రయాణిస్తే జైలు శిక్ష

శంషాబాద్, జూన్ 28 : వాహనదారులు వ్యతిరేక మార్గంలో ప్రయాణిస్తే వారికి 3నెలల జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తామని శంషాబాద్ డివిజన్ ట్రాఫిక్ ఏసీపీ పి.నాగభూషణం శుక్రవారం తెలిపారు. నెల రోజుల నుంచి శంషాబాద్ ఎస్‌హెచ్ఓ, సిబ్బందితో ప్రధాన రహదారులపైన వ్యతిరేక మార్గంలో వాహనాలు నడుపుతున్న వారిపై 15 కేసులు నమోదు చేశామన్నారు. 73మందిపై కేసు నమోదు చేశామన్నారు.

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి



విద్యార్థులకు నగదు, మెమొంటోను అందజేస్తున్న నాయకులు, టీచర్లు

షాబాద్, జూన్ 28 : విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాని మాజీ ఎమ్మెల్సీ జనార్దన్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిమహేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధి హైతాబాద్ పాఠశాలలో అదే పాఠశాలకు చెందిన వల్లభనేని మాధవి అనే ఉపాధ్యాయురాలు ఈ ఏడాది పదవ తరగతిలో మంచి గ్రేడు సాధించిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 13మందికి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహకాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పేరు ప్రతిష్ఠలు తేవా లన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శంకర్‌రాథోడ్, మండల నోడల్ ఆఫీసర్ లక్ష్మణ్, ప్రధానోపాధ్యాయులు వసంత, రాజ్‌గోపాల్‌సింగ్, యామిని, గోవింద్, విష్ణువర్ధన్‌రెడ్డి, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు సుదర్శన్, గౌరవాధ్యక్షుడు యాదయ్య, కార్యదర్శి కృష్ణ, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, సునీత, నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

సింగిల్ రోడ్డును

డబుల్‌గా మార్చండి

మాడ్గుల, జూన్ 28: మండలంలోని జడ్పీ పాఠశాల నుంచి బ్రాహ్మణపల్లి వరకు ఉన్న సింగల్ బీటీ రోడ్డును డబుల్ రోడ్డుగా మార్చాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు. ఆరేడు ఫీట్ల లోపు వెడల్పు ఉన్న రోడ్డుతో నిత్యం ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్నారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ సన్నటి రోడ్డుపై ప్రయాణం తమకు ప్రాణాంతకంగా మారుతోందని తెలిపారు. ఈ రోడ్డుపై నాలుగేళ్ల క్రితం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారని, అలాగే తరచూ ప్రమాదాలు చోటుచేసుకొని గాయపడుతున్నారని తెలిపారు. ఇటీవల లారీ ఎదుగా వచ్చిన బైక్‌ను తప్పించ బోయి గుంతలో పడిందన్నారు. నల్లచెర్వు, బ్రాహ్మణపల్లి, ఆర్కపల్లి, అందుగుల, అంతమ్‌పేట, కుబ్యతండా, జర్పుల తండా, మణ్యతండా, అన్నెబోనిపల్లి, సుద్దపల్లి తదితర గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి ఈ రోడ్డు గుండానే వస్తూపోతుంటారు. ఈ రోడ్డుపై బైక్‌పై వచ్చినా ఇంటికి చేరే వరకు నమ్మకం లేదని వాపోతున్నారు. దీన్ని డబుల్ రోడ్డు చేస్తామని ఎంపీ, ఎమ్మెల్యేలు హామీ ఇచ్చినా నెరవేర్చడం లేదు. ఇప్పటికైనా మండల ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని డబుల్ బీటీ రోడ్డుగా మార్చాలని ప్రజలు కోరారు.



ఇబ్బందికరంగా ఉన్న సింగిల్ రోడ్డు

నిరుపేదలకు చేయూతనివ్వాలి



ఆర్థిక సాయం అందజేస్తున్న జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, జూన్ 28: నిరుపేద కుటుంబాలకు ప్రభుత్వం చేయూతనందించి ఆదుకోవాలని జడ్పీటీసీ దశరథ్‌నాయక్ కోరారు. పథకాల అమలులో రాజకీయాలకు చోటులేకుండ అర్హులందరికీ ఇవ్వాలని సూచించారు. సాలార్‌పూర్‌లో శుక్రవారం దశరథ్ పర్యటించారు. ఎంపీటీసీ ప్రియరమేశ్‌తో కలిసి అంతర్గత రోడ్లు, మురుగు కాల్వలు, తాగునీటి పథకాలు, అబివృద్ధి పనులను పరిశీలించారు. అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. అదే విధంగా గ్రామంలో అనారోగ్యంతో మృతిచెందిన సూర్తి కుటుంబాన్ని దశరథ్ పరామర్శించారు. జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ తరఫున రూ.5వేలు ఆర్థిక సాయ అందజేశారు. ఎంపీటీసీ ప్రియరమేశ్ రూ.3వేలు అందించారు. సేవా కార్యక్రమాలలో ట్రస్ట్ ముందుంటుందని తెలిపారు. కార్యక్రమంలో రైతు సమితి జిల్లా సభ్యుడు బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ పంతూ, మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, జైపాల్, గోపాల్, పాండు, దేవుజా, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఆర్‌సీ మెంబర్‌ను కలిసిన జగన్



ఆమనగల్లు, జూన్ 28 : జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయ భారతిని శుక్రవారం మాడ్గుల మండలం అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన తెలంగాణ ప్రజారోగ్య బాధితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, సుప్రీం కోర్టు న్యాయవాది ఉడుతల జగన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలోని ఎన్‌హెచ్‌ఆర్‌సీ కార్యాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో వైద్య రంగంలో ప్రజలకు న్యాయం జరిగేలా చూడాలని, కార్పొరేట్ ఆసుపత్రులపై దృష్టిసారించాలని విజయభారతిని కోరగా ఆమె సానుకూలంగా స్పందించారని జగన్ పేర్కొన్నారు. న్యాయవాది వంశీకృష్ణ కూడా విజయభారతిని కలిశారు.

అధికారులపై

దాడులు అమానుషం

షాద్‌నగర్ అర్బన్, జూన్ 28: తెలంగాణ రాష్ట్ర జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ రమేష్‌పై ఖైరతాబాద్‌లోని కార్యాలయంలో ఆటోయూనియన్ అధ్యక్షుడు అమానుల్లా ఖాన్ దాడిచేయడాన్ని షాద్‌నగర్ డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్ ఖండిస్తూ నిరసన వ్యక్తం చేసింది. డ్రైవింగ్ స్కూల్ అసోసియేషన్ అధ్యక్షుడు విజేయందర్‌రెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం షాద్‌నగర్ ఎంవిఐ ప్రాంతీయ కార్యాలయానికి వెళ్లి నిరసన వ్యక్తం చేశారు. అమానుల్లాఖాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిందితుడిపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామన్నారు. వాహన తనిఖీ అధికారి ఎక్కాల వాసుకు వినతిపత్రమిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు లక్ష్మణ్, కిరణ్‌కుమార్‌గౌడ్, బస్వరాజ్‌గౌ డ్, చెరుకు రాములు పాల్గొన్నారు.

స్కూల్ బస్సు డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

షాబాద్, జూన్ 28 : పాఠశాలల్లో విద్యార్థులను రవాణా చేసే బస్సు డ్రైవర్లు రోడ్డు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని షాబాద్ ఇన్‌స్పెక్టర్ కాంతారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం పాఠశాల బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... స్కూల్ బస్సుల్లో కెపాసిటీ మేరకు విద్యార్థులను ఎక్కించుకోవాలన్నారు. పాఠశాల ముందు రోడ్డుపై తప్పనిసరిగా బారికెడ్లు, స్పీడ్ బేకర్లను ఏర్పాటు చేయాలన్నారు. రాంగ్ రూట్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, డ్రైవింగ్, లైసన్స్ లేనివారు వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రోడ్డు నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యం చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్సైలు నవీన్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య విద్యార్థినికి ఎమ్మెల్యే అభినందన



మౌనికకు చెక్కు ఇస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 28: ఆలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌స్ (ఎయిమ్స్) నిర్వహించిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్ సూపర్ స్పెషాలిటీ(ఐఎన్ఐఎస్ఎస్) అరత పరీక్షలో షాద్‌నగర్‌కు చెందిన పల్లాటి మౌనిక రెండో ర్యాంక్ సాధించడం రాష్ట్రానికే గర్వకారణమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. షాద్‌నగర్ ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న మహాలింగం పెద్ద కుమార్తె మౌనిక ఐఎన్ఐఎస్ఎస్‌లో రెండో ర్యాంక్ సాధించిన విషయం తెలిసిందే. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శంకర్ శుక్రవారం షాద్‌నగర్‌లోని మహాలింగం ఇంటికి వెళ్లారు. మౌనికను, ఆమె తల్లిదండ్రులు సరిత, మహాలింగంలను సన్మానించారు. ఐఎన్ఐఎస్ఎస్ పరీక్షలో జాతీయ స్థాయి రెండో ర్యాంక్ సాధించడం గొప్ప విషయం అన్నారు. వైద్యంలో సూపర్ స్పెషాలిటీ పూర్తిచేసి గొప్ప అంకాలజీ స్పెషలిస్టు కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. చదువుకు తన వంతు ఆర్థిక సాయంగా 50వేల చెక్కును మౌనికకు అందజేశారు. ఆమెను ప్రతీ విద్యార్థి ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, రఘు, హరినాథ్‌రెడ్డి, ఇబ్రహీం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పీవీ జయంతి వేడుకలు



కడ్తాలలో పీవీ నర్సింహారావు జయంతి వేడుక

కడ్తాల్/తలకొండపల్లి, జూన్ 28: సరళీకృత ఆర్థిక విధానాలు, సంస్కరణలతో దేశం బలమైన ఆర్థిక శక్తిగా ఎదిగేందుకు పునాదులు వేసిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావును జాతి మరువదని ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కడ్తాల మండల పరిషత్ వద్ద శుక్రవారం మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని నిర్వహించారు. ఎంపీడీవో సుజాత, మండల కో-ఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, ఎంపీటీసీ నిర్మలదేవి, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాంచందర్‌నాయక్, సత్యం యాదవ్, పాలకుర్ల కరుణాకర్ గౌడ్, కాశీనాథ్ రెడ్డి, మల్లయ్య ఉన్నారు. తలకొండపల్లిలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో పీవీ జయంతిని నిర్వహించారు. అలాగే హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన పీవీ జయంతి వేడుకల్లో శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు. పీవీ కూతురు, ఎమ్మెల్సీ వాణీదేవిని ఈ సందర్భంగా సత్కరించారు.

పీవీ నర్సింహారావును మరిచిన చేవెళ్ల నేతలు

చేవెళ్ల: మాజీ ప్రధాని పీవీ.నర్సింహారావు జయంతిని చేవెళ్ల కాంగ్రెస్ నేతలు మర్చిపోయారు. చేవెళ్లలో కాంగ్రెస్ నాయకులు పీవీని స్మరించుకోలేదు. కాంగ్రెస్ నాయకులు పీవీ జయంతిని జరపకపోవడం పార్టీ నేతల పనితీరుకు నిదర్శనం అని పలువురు చర్చించుకున్నారు.

మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకుంటేనే కుటుంబాల వృద్ధి



వార్షిక నివేదికను వివరిస్తున్న సీఈవో సంగీత

ఇబ్రహీంపట్నం, జూన్ 28 : మహిళలు స్వశక్తితో ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే ఆ కుటుంబాలు వృద్ధిలోకి వస్తాయని ఓం ప్రగతి పరస్పర సహాయక సహకార పొదుపు పరపతి సంఘాల సమాఖ్య అధ్యక్షుడు మెట్టు అశోక్‌రెడ్డి, సీఈవో టి.సంగీత అన్నారు. సమాఖ్య 12వ వార్షిక మహాసభ శుక్రవారం వైష్ణవీ గార్డెన్స్‌లో జరిగింది. మొదట వార్షిక నివేదికను సంగీత వినిపించారు. వారు మాట్లాడుతూ మొత్తం 7మండలాల్లో 57 సంఘాలతో, 20,500 మంది సభ్యుల సమాఖ్య నడుస్తోందన్నారు. పొదుపుతో పాటు రుణాలు పొందుతూ సంఘాల బలోపేతం అవుతున్నాయని కొనియాడారు. రూ.9కోట్ల టర్నోవర్‌తో సమాఖ్య విజయవంతంగా నడుస్తోందన్నారు. సభలో సమాఖ్య ఉపాధ్యక్షులు నెల్లూరి నాగరాణి, పాలకవర్గ సభ్యులు కె.లింగమయ్య, అరుణ, ఎండీ పర్వీన్, జె.అరుంధతి, వెంకటచారి, కాకి పద్మ, పి.లలిత, అకౌంటెంట్ డి.వెంకటేష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్య

- పిల్లల పరిస్థితి విషమం
- నగరంలోని నిలోఫర్‌కు తరలింపు
- శంషాబాద్‌లో దారుణం



ఆత్మహత్య చేసుకున్న ప్రియాంక

శంషాబాద్, జూన్ 28: శంషాబాద్ మున్సిపల్‌లో శుక్రవారం దారుణం చోటు చేసుకుంది. ఓ తల్లి తన ఇద్దరు పిల్లలకు విషమిచ్చి తాను ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఇద్దరు పిల్లలను స్థానికులు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం బీదర్‌కు చెందిన సోమశేఖర్, ప్రియాంక(26) దంపతులు వలసొచ్చి ఆర్బీనగర్ బస్తీలో అద్దెకుంటున్నారు. సోమశేఖర్ ఓ కొరియర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. వీరికి ఇద్దరు సంతానం ఆద్విక్(3), ఆరాధ్య(7 నెలలు) ఉన్నారు. భర్త డ్యూటీ ముగించుకొని ఇంటికొచ్చే సరికి భార్య ఉరేసుకొని చనిపోయింది. విషం ఇవ్వడంతో కొట్టుమిట్టాడుతున్న ఇద్దరు పిల్లలను బస్తీవాసులు నగరంలోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు. ఆద్విక్ కోలుకుంటుండగా ఆరాధ్య పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. అయితే ప్రియాంక పిల్లలకు విషం ఇచ్చి ఎందుకు ఆత్మహత్య చేసుకుందన్న వివరాలు తెలియరాలేదు. ఆర్జీఐఏ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. సీఐ బాల్‌రాజ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త వేధింపులు భరించలేక వివాహిత ...

శంకర్‌పల్లి, జూన్ 28:భర్త వేధింపులతో వివాహిత ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మోకిల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండాకల్ గ్రామానికి చెందిన మొనగళ్ల శేఖర్‌తో చందిప్పకు చెందిన లక్ష్మితో 2015లో వివాహమైంది. వారికి కూతురు పల్లవి, కుమారుడు లక్కి ఉన్నారు. కాగా వారు కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. కొన్ని రోజులుగా శేఖర్ భార్య లక్ష్మిని డబ్బుల కోసం వేధించాడు. బుధవారం భార్యాభర్తలు గొడవపడ్డారు. దీంతో ఆమె గురువారం అర్ధరాత్రి ఉరేసుకుంది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు మోకిల సీఐ వీరబాబు తెలిపారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

వంకర్‌పల్లి, జూన్ 28 : ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఇక్ఫాయ్ యూనివర్సిటీ విద్యార్థిని ఆర్.లేఖ్య(21) శుక్రవారం తెల్లవారు జామున మృతిచెందింది. ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. మే 15న దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయి యూనివర్సిటీ కాలేజీలో బీబీఏ(ఎల్ఎల్‌బి) ఫైనల్ ఇయర్ విద్యార్థిని ఆర్.లేఖ్య హాస్టల్ రూంలో స్నానం చేసేందుకు గీజర్ ఆన్ చేయగా అధిక వేడి నీరు పడి గాయాలయ్యాయి. లేఖ్యను వెంటనే కళాశాల యాజమాన్యం గచ్చిబౌలిలోని కాంటినెంటల్ ఆసుపత్రికి తరలించింది. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి కొత్తపేటలోని ఓమ్ని ఆసుపత్రికి, తదనంతరం కంచన్‌బాగ్‌లోని డీఆర్‌డీఏ అపోలో ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లేఖ్య శుక్రవారం ఉదయం 5:50గంటలకు మృతిచెందింది. తమ కూతురు 44రోజుల పాటు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడడం, చివరకు మృతిచెందడం తల్లిదండ్రులను కలిచివేసింది. స్నానం చేసే నీటిలో యాసిడ్ కలిసిందనే వదంతులు రాగా పోలీసులు నీటిని ల్యాబ్‌కు పంపారు. నీటిలో యాసిడ్ లేనట్టు తేలినట్టు సమాచారం. మోకిల పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి తరలింపును అడ్డుకున్న పోలీసులు

కేశంపేట, జూన్ 28: అనుమతి లేకుండా చేపడుతున్న మట్టి తరలింపును పోలీసులు అడ్డుకుని వాహనాలను స్టేషన్‌కు తరలించారు. ఎస్ఐ లింగం, వేముల్‌నర్వ గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వేముల్‌నర్వకు చెందిన కొందరు రైతులు తమ పొలాలకు దారికి, పశువుల కొట్టాల్లో పోసేందుకు శుక్రవారం గ్రామ సమీప గుట్టనుంచి మట్టిని తరలించారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్, ఎక్స్‌వేటర్‌లను అడ్డుకున్నారు. తాము మట్టి అమ్ముకోవడంలేదని పొలాల బాటకు, పశువుల కొట్టాల్లో పోసేందుకు తీసుకెళ్తున్నామని రైతులు తెలిపారు. అయినా అనుమతులు తీసుకోవాల్సిందే అని పోలీసులు వాహనాలను స్టేషన్ తరలించారు. దీనిపై విచారణ చేసి ఉన్నతాధికారుల సూచనల మేరకు చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

శేరిగూడ-మంగల్‌పల్లి బ్రిడ్జి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలి



శేరిగూడ బ్రిడ్జి వద్ద నిరసన తెలుపుతున్న బీజేవైఎం నాయకులు

ఇబ్రహీంపట్నం, జూన్ 28:నాగార్జునసాగర్ ప్రధాన రహదారి శేరిగూడ-మంగల్‌పల్లి మధ్య ఉన్న శ్రీ ఇందూ ఇంజనీరింగ్ కళాశాల వద్ద బ్రిడ్జి నిర్మాణం వెంటనే పూర్తి చేయాలని డిమాండ్‌తో బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీష్, నియోజకవర్గ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం చెరువు అలుగు ద్వారా వరద నీరుపారే ప్రదేశంలో ఈ బ్రిడ్జి పనులు చేపట్టి రెండేళ్లు దాటినా పూర్తి చేయలేదని ఆందోళన వెలిబుచ్చారు. ఇక్కడ ఓ వైపు బ్రిడ్జి నిర్మించి దీనికి అప్రోచర్ వేయకుండా వదిలేశారని, దీంతో ఒకే వైపున వాహనాల రాకపోకలు కొనసాగుతూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పనులుపూర్తి కావాల్సి ఉన్నా కాంట్రాక్టర్‌కు బిల్లులు విడుదల చేయక పనులు నిలిపివేశారన్నారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తక్షణమే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు జక్క రవీందర్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు దండె శ్రీశైలంయాదవ్, మున్సిపల్ అధ్యక్షుడు నర్సింహారెడ్డి, బీజేవైఎం లీగల్‌సెల్ కన్వీనర్ పి.శ్రీశైలెం, నాయకులు దిలీప్‌గౌడ్, శాంతికుమార్, విజయ్ కుమార్, ఐలేష్, శేఖర్‌రెడ్డి, మహేష్, వినయ్ పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్ గేమ్‌లకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న షీ టీం ఎస్సై

ఆదిభట్ల, జూన్ 28: విద్యార్థులు సెల్‌ఫోన్ గేమ్‌లకు దూరంగా ఉండాలి, లేనిపక్షంలో చదువులో వెనబడిపోవడమే కాకుండా దీర్ఘకాలిక అనర్థాలకు కారణం అవుతుందని షీ టీం ఎస్సై శ్రీనివాసులు అన్నారు. ఆదిభట్ల ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు ఆన్‌లైన్, సైబర్ నేరాలు, విద్యార్థినులకు గుడ్ టచ్.. బ్యాడ్ టచ్ లాంటివి వాటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులు ఫోన్‌లకు పంపిన లింక్‌లను ఓపెన్ చేయొద్దన్నారు. అలాచేస్తే జరిగే మోసాలపై వివరించారు. సైబన్ నేరాలు జరిగితే వెంటనే 1930కు కాల్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. అపరిచితులు చాక్లెట్లు, స్వీట్లు లాంటి తినబండారాలు ఇస్తే తీసకోవద్దని తెలిపారు. ముఖ్యంగా విద్యార్థినులు ఎదుటి వ్యక్తుల చనువు పట్ల అప్రమత్తంగా ఉండాలని, గుడ్ టచ్ బ్యాడ్ టచ్ గుర్తించి తల్లిదండ్రులకు చెప్పాలన్నారు.బ్యాడ్‌గా ప్రవర్తించే వారికి దూరంగా ఉండాలన్నారు. హెచ్ఎం పరమేష్, బబ్లీ, షీ టీం సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

● **షాద్‌నగర్ అర్బన్:** తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డికి షాద్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్, లారీ ఓనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సయ్యద్ సాధిక్ శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర ప్రజాభవనంలో చిన్నారెడ్డిని సాదిక్, కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

● **కేశంపేట:** మట్టికి అమ్ముకోవడం లేదని, పొలాలకు బాటలు, పశువుల కొట్టంలోకి కొట్టుకుంటున్నమని తహసీల్దార్ మీర్ అజాం అలీకి వేముల్‌నర్వ రైతులు వినతిపత్రం అందించారు. గ్రామ సమీప గుట్టనుంచి మట్టిని తీసుకెళ్తున్నామని తెలిపారు. వానకాలంలో పొలం బాటలు దెబ్బతింటాయని, మట్టితో గుంతలను నింపుతున్నమే తప్ప మట్టిని అమ్ముకోవడంలేదని వివరించారు. పోలీసులు స్వాధీనం చేసుకున్న తమ వాహనాలను విడిపించాలని వినతిపత్రంలో కోరారు. రైతులు రాజు, జంగయ్య, కుమార్, నర్సింలు, చెంద్రయ్య, మల్లేష్ శ్రీను, సురేష్, శివకుమార్ పాల్గొన్నారు.

● **చేవెళ్ల:** ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన సందర్భంగా రాజేంద్రనగర్ మండలంలో టీడీపీ నాయకులు విజయోత్సవ సభ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్ర నాయకులు సామ భూపాల్‌రెడ్డితోపాటు ఆ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో విజయోత్సవ సభ పెద్దఎత్తున నిర్వహించారు. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కాసుల సుభాన్‌గౌడ్ ఆధ్వర్యంలో చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, మొయినాబాద్, నవాబ్‌పేట్ మండలాల నుంచి టీడీపీ నాయకులు సభలో పాల్గొన్నారు. ఆయా మండలాల పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి, యాదయ్య, కృష్ణయ్య, ఆంజనేయులు, మాణిక్యం ఆయా మండలాల పార్టీ నాయకులు, కార్యర్తలు ఉన్నారు.

● **కందుకూరు:** మండలంలోని గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు జడ్పీ నుంచి మంజూరైన రూ:53.79లక్షలతో శంకుస్థాపనలు చేపట్టేందురకు శనివారం జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి కందుకూరుకు రానున్నారని జడ్పీటీసీ జంగారెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎంపీటీసీలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అధికారులు హాజరుకావాలని కోరారు.

● **కందుకూరు:** విద్యుత్ మరమ్మతుల నిమిత్తం శనివారం వివిధ ఫీడర్లలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ రమేష్‌గౌడ్ తెలిపారు. కందుకూరు టౌన్ ఫీడర్‌తో పాటు వ్యవసాయానికి సరఫరా చేస్తున్న విద్యుత్ ఫీడర్‌ను మార్చనున్నట్లు తెలిపారు. శనివారం ఉదయం 10:30 నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండద న్నారు. అలాగే దెబ్బడగూడ 11కేవీ, మఖాన్ వ్యవసాయ ఫీడర్‌ను షిఫ్టింగ్ పనుల నిమిత్తం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు. నేదునూరుటౌన్ 11కేవీవిద్యుత్ ఫీడర్, మన్నెగూడ, అలీఖాన్‌పల్లి, ఫీడర్లలో ఉదయం 10:30 నుంచి 3గంటల వరకు విద్యుత్ సరిఫరాను నిలిపివేస్తామని తెలిపారు. రాచులూరు టౌన్ 11కేవీ ఫీడర్, ఏపీఆర్ ఫీడర్లకు ఉదయం 10:30 నుంచి 11:30గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని తెలిపారు.

● **చేవెళ్ల:** మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహిస్తామని ఎంపీడీవో హిమబిందు తెలిపారు. ఆమె మాట్లాడుతూ.. చేవెళ్ల మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ మల్గారి విజయలక్ష్మి అధ్యక్షతన ఉదయం 10:30 గంటలకు ప్రారంభం అవుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు సహకాలంలో హజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

● **కందుకూరు:** జులై 2న మండల సహకార పరపతి సంఘం అత్యవస సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు సంఘం కార్యదర్శి నిమ్మ యాదగిరిరెడ్డి తెలిపారు.

దొంగల ముఠా సంచారంతో జనం బెంబేలు

● పలు చోట్ల చోరీలకు యత్నం

యాచారం, జూన్ 28: యాచారం, హైదరాబాద్ గ్రీన్‌ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో దొంగల సంచారంతో జనం బెంబేలెతుత్తున్నారు. దొంగలు పగటి పూట కార్లలో తిరిగి సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకుంటూ రాత్రిపూట చోరీలకు యత్నిస్తున్నారు. నాలుగు రోజుల క్రితం కుర్మిద్దలో మంగలి జంగయ్య ఇంటి ప్రహరీ దూకి బైక్ చోరీకి యత్నించారు. ఇంటి వారు లేచి అరవడంతో దొంగలు పారిపోయారు. స్థానికులు 100కు కాల్ చేయగా పోలీసులు రావడంతో దుండగులు కందుకూరు వైపు పారిపోయా రు. అలాగే నజ్దిక్‌సింగారం పంచాయతీ వెనక, నజ్దిక్‌సింగారంలో గొర్ల మందల్లోని గొర్ల అపహరణకు విఫలయత్నం చేశారు. కాపరులు ఎదురు తిరగడంతో దొంగలు పరారయ్యారు. చిన్నతూండ్లలో వారం రోజుల క్రితం నంబర్‌ప్లేట్ లేని కారులో ముగ్గురు తిరుగుతూ వీడియోలు తీస్తూ చిన్నతూండ్ల వైపు వెళ్లారు. దుండగులు తల, ముఖం కన్పించకుండా గుడ్డ కప్పుకొని తిరుగుతున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. కొన్ని రోజులుగా శ్రీశైలం-హైదరాబాద్ అలాగే నాగార్జునసాగర్-హైదరాబాద్ రహదారులకు చెక్‌పోస్టులు ఎత్తివేయడంతో దొంగలు రెచ్చిపోతున్నారు. కుర్మిద్దలో దుండగులు చేసిన పనితో రాత్రి వేళ గ్రామస్తులు జాగారం చేయకతప్పడం లేదని పలువురు గ్రామస్తులు తెలిపారు. కాగా దొంగల ముఠా సంచారంపై కుర్మిద్ద వాసి జయమ్మ మాట్లాడుతూ.. తమ ఇంట్లో దొంగలు బైక్‌ను ఎత్తుకెళ్లే ప్రయత్నం చేయగా తాము లేచే సరికి పారిపోయారని తెలిపింది. సాయంత్రమైతే నిద్రపట్టడం లేదని, గ్రామంలో పోలీస్ గస్తీ పెట్టాలని కోరారు. దీనిపై సీఐ శంకర్‌కుమార్ మట్లాడుతూ రాత్రి వేళ పెట్రోలింగ్ ముమ్మరం చేశామన్నారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు. గ్రామాల్లో గస్తీ పెంచాం అన్నారు. దొంగలను పట్టుకునేందుకు క్రైంపార్టీ పోలీసులు గాలిస్తున్నట్లు చెప్పారు.